

# తమసోమా జ్యోతిర్గమయ

కమలామణి

ఆవేళ విందుపున్నమి. కాని, మబ్బుల మూలకంగా మసకవెన్నెల!

పనిమీద గిద్దలూరు వెళ్ళాను. మధ్యాహ్నానికే అవుతుందని అనుకొన్న పని, సాయంత్రందాకా పట్టింది. జీప్ ఉంది కాబట్టి వెంటనే ఊరికి వెళ్ళవచ్చు గాని, ఘాట్ రోడ్డులో రాత్రివేళ పోవడం ప్రమాదం. డ్రైవర్ మంచివాడయితే, ఈ పున్నమి రేయి నల్లమల లోయలలోని ప్రకృతి సౌందర్యాన్ని తనివితీరా అనుభవిస్తూ పోవచ్చు. కాని, మా డ్రైవర్ మాసూమ్, సాయంత్రం ఆరున్నర అయ్యేసరికి మాంచి నిషాలో ఉంటాడు! ప్రాణాలమీద తీపి ఉన్నవాళ్ళెవరూ, వాణ్ణి రాత్రిపూట డ్రైవ్ చెయ్యమని అడగరు. కనక, ఆ రాత్రికి ఆగిపోదామనే నిశ్చయించుకొన్నాము.

ఒక చక్కని ఆలోచన వచ్చింది. దగ్గిరగా ఉన్న దిగువమెట్ట ఫారెస్ట్ బంగళాలో రాత్రి మకాం వేస్తే!

అద్భుతం! ఆలోచన రావడమేమిటి, ఫారెస్ట్ ఆఫీసర్ దగ్గరనుండి బంగళా తీసుకోవడమేమిటి అంతా నిమిషాలమీద జరిగిపోయింది. బంగళానించి కనపడే అడవి, దూరంగా కొండలూ, చెట్ల ఆకుల సందుల్లోనుంచి నృత్యం చేస్తూ దూకే వెన్నెలా, బంగళా దగ్గరగా ప్రవహించే చిన్న సెలయేరూ ఊహించుకొంటే, .. ఇక నేను నిగ్రహించుకోలేక పోయాను. మామావ్‌ను వెనక సీట్లో కూలేసి, జీప్‌ను మెల్లిగా డ్రైవ్ చేసుకొంటూ దిగువమెట్ల (ట్రావెలర్స్) బంగళా చేరాను.

ఇదివరలో రెండు మూడు సార్లు వచ్చాను కాబట్టి బంగళా వాచ్‌మన్‌కు నేను తెలుసు. తప్ప తాగి పడిఉన్న మామావ్‌వల్ల నాకీ రాత్రి ఒక్క పనీ జరగదు. వాచ్‌మన్ కూజాతో మంచినీళ్ళు పట్టి, పెట్టాడు. రూము శుభ్రం చేశాడు.

ఆ ఊళ్ళో మా కుటుంబానికి పరిచితులైన కృష్ణశాస్త్రిగారింటికి పోయి, నా పేరు చెప్పి, చిక్కని కాఫీ రెండు కప్పులు తెమ్మని వాచ్‌మన్‌ను పంపాను. వేళగాని వేళ అయినా, కృష్ణశాస్త్రిగారు, వారి భార్యా బాగా పరిచితులు కాబట్టి కాఫీకి పంపితే ఏమనుకోరు. అందమైన ఈ ప్రకృతిమీద నాకుండే మోజు వారికి బాగా తెలుసు. పోతే, వాళ్ళింటికి పంపితే వచ్చే ఇబ్బంది ఏమంటే, మరునాడు వాళ్ళింట్లో భోజనం చేస్తేగాని నన్ను వదలరు!

అరగంట కూర్చున్నా వాచ్‌మన్ రాలేదు. ఎదురుగా ఉన్న వెలగచెట్టుమీదినించి వెన్నెల కిందికి దూకుతున్నది. ఇక ఉండలేక, ఫ్లాస్క్ జాగ్రత్తగా ఉంచమని వాచ్‌మన్ భార్యకు చెప్పి, నా ట్రాన్సిస్టర్‌తో వెన్నెల్లో షికారుకు బయలుదేరాను.

ట్రాన్సిస్టర్‌నుంచి వచ్చే సంగీతము, చుట్టూ చీకటిలాగా అలముకొన్న అడవి, అడవిలోని అస్పష్ట ధ్వనులు, చీకట్లతో దోబూచులాడే వెన్నెల — నన్ను నేను మరిచాను. ఇది గుండె బరువెక్కించే అందం! భరించలేని అందం! ఇంత అందమూ ఇవాళ నా సొత్తు!

అటు అడవీ—ఇటు నేనూ! అప్రయత్నంగా పాడాను;. "ఒక్కెడ్డే ఇసుకబయలు, ఒక్కెడ్డే కడలి చదలు, ఉవ్వెత్తుల దూరమున, దశ దిశాంతరాళమందు!"

సన్నగా తుంపర పడడం ప్రారంభించింది. వెన్నెలలో కాస్త, వానజల్లులో కాస్త తడిసిన అడవి అందం రెట్టింపయింది!

వాన బాగా వచ్చే సూచన లుండడం చేత, నెమ్మదిగా నడుస్తూ బంగళా చేరాను.

ఆవరణలో ఎవరో చేతులు కట్టుకొని, అటూ ఇటూ పచార్లు చేస్తున్నారు. వాచ్‌మన్ కాదు.

తలుపు తీస్తూఉంటే, "ఏమండీ! బాగున్నారా?" అనే ప్రశ్న వినిపించి వెనక్కి చూశాను. ఇందాక నేను చూసిన ఆయనే! గొంతు ఎక్కడో విన్నట్లుంది.

లోపలికి పోయి స్విచ్ నొక్కాను. గది అంతా వెలుగు నిండింది. వెలుగులోకి ప్రవేశించిన ఆయన ముఖం కూడా బాగా పరిచయమైన ముఖమే! కాని సరిగా గుర్తుకు రావటం లేదు.

"రండి, కూర్చోండి" అంటూ ఆయన్ని మర్యాదగా ఆహ్వానించి, కుర్చీ జరిపాను, 'ఇంత రాత్రివేళ ఏ పని ఉంటుందబ్బా' అని ఆలోచించుకొంటూ.

ఆయన్ని నేను గుర్తు పట్టలేదన్న సంగతి స్పష్టంగా తెలిసినట్లుంది. అందుకే, "నేనండీ, నరసింహామూర్తిని, ఆనందపురంలో మీరు పనిచేసేటప్పుడు మీ హెడ్మాస్టర్ని" అని స్వపరిచయం చేసుకొన్నాడు.

నా మెదడులో మెరుపు మెరిసింది! గతమంతా ఉప్పెనలాగా గుర్తుకు వచ్చి, నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది.

అది 1950 వ సంవత్సరం. నాన్నగారు కర్నూలు ట్రెయినింగ్ స్కూల్ హెడ్మాస్టర్‌గా పనిచేసి, రిటైర్ అయ్యారు. రిటైరయ్యేనాటికి నాన్నగారికి ఉన్న ఆస్తి ప్రావిడెంటుఫండు రెండు వేల రూపాయలు, నలుగురు కూతుళ్ళు, ఇద్దరు కొడుకులూను.

నలుగురిలో నేను రెండవదాన్ని. అక్క విజయ కర్నూలులోనే సైన్సుటీచరుగా పనిచేస్తున్నది. నేను బి. టి. పాసై ఉద్యోగాన్వేషణలో ఉన్నాను. తమ్ముళ్ళలో ఒకడు ఇంటర్మీడియేట్ సీనియర్, మరొకడు జూనియర్. చెల్లెళ్ళలో సుజాత ఫోర్తు ఫారం, నర్మద అయిదవ తరగతిను.

ఆ సంవత్సరమే, అంటే 1950 లో అన్నమాట, కొత్తగా ఆనందపురంలో కమిటీ హైస్కూలు పెట్టారు. అందులో పనిచెయ్యటానికి ఇద్దరు సైన్సు టీచర్లు కావాలని పేపర్లో ప్రకటించారు. ఇద్దరికీ (అక్కకు, నాకు) ఒకే ఊళ్ళో ఉద్యోగం చిక్కితే, తమ్ముళ్ళు, చెల్లెళ్ళు చదువుకోటానికి బాగుంటుందని ఇద్దరం దరఖాస్తులు పెట్టాము. మా అదృష్టంవల్ల, భగవంతుడు కమిటీ మెంబర్ల మనస్సుల్లోకి ప్రవేశించి, ఇద్దరికీ ఉద్యోగాలిప్పించాడు.

**ఎంతటివాడయినా మనిషి అన్న తరవాత లోటుపాట్లు ఉండక తప్పదు. ఈ సత్యాన్ని గుర్తించక గుర్తించవలసిన అవసరంలేక కొందరు ఎదుటివారి లోపాలను, బలహీనతలను ఆధారం చేసుకుని తమ ఆధిక్యాన్ని నిరూపించాలనుకుంటారు. పరిణామాలు మాత్రం ఆశించని విధంగా ఉంటాయి.**

అది మగపిల్లల బడి. నేను, అక్క తప్ప మిగతా అంతా మగవాళ్ళే. హైస్కూలు మొత్తంమీద 25 మంది బాలిక లుండేవాళ్ళు. బళ్ళో మాతో పిల్లలు, టీచర్లు అంతా కలుపుగోలుగా ఉండేవాళ్ళు. అది 1950 అయినా, 1990 అయినా మానవ నైజంలో మార్పులు ఆట్టే రావు కాబట్టి, మే మెవరితోనన్నా మగవాళ్ళతో మాట్లాడితె విమర్శించే పెద్దలుకూడా ఉండేవాళ్ళు. అయితే, దూషణకు, భూషణకు అలవాటు పడడం నేర్చుకొన్నాము. మొత్తానికి మా కుటుంబానికా ఊళ్ళో బాగానే ఉండేది.

ఆ ఊళ్ళో ఒకనాటి సంఘటనే ఈ కథకు నాంది.

ఆవేళ హెడ్మాస్టర్‌గారింట్లో పేరంటం. వాళ్ళ మూడో అమ్మాయి సమజ వ్యక్తురాలయిందిట. నాకీ పేరంటాలంటే అంతగా ఇష్టం ఉండదు. అయినా, హెడ్మాస్టర్‌గారింట్లో కాబట్టి వెళ్ళకపోతే బాగుండదు. ఆ రోజు మా అక్కకు జ్వరం. నేనొక్కదాన్నే వెళ్ళవలసి వచ్చింది.

నేను అక్కడికి పోయేటప్పటికి సాయంత్రం ఏడు గంటలు దాటుతున్నాది. ఇద్దరో, ముగ్గురో పేరంటాళ్ళున్నారు. వాళ్ళూ కాస్సేపటికి అంతా వెళ్ళారు. నేను, హెడ్మాస్టర్‌గారి భార్య కామాక్షమ్మగారు, ఆయన రెండో కూతురు ప్రసన్న ఏవో పిచ్చాపాటీ మాట్లాడుకొంటున్నాము. ఇంతట్లోకే ఆయన క్లబ్బునుంచి వచ్చారు.

కబుర్లలో అవీ ఇవీ దొర్లి, చివరకు పరీక్షలు, ఫలితాలు ప్రవేశించాయి.

మాటల సందర్భంలో నేను, "మీ వనజ చక్కగా చదువుతుంది. స్కూల్‌ఫైనల్‌లో మంచి మార్కులు వస్తాయి" అని అన్నాను. వనజ స్కూల్లో సిక్స్తుఫారం చదువుతున్నది.

మందహాసం చేసి హెడ్మాస్టర్‌గారన్నారు: "వనజ ఇక బడికి రాదు. మంచి సంబంధాలు రాగానే దీనికీ, ప్రసన్నకూ పెళ్ళి చేస్తాను."

నా మనస్సు చివుక్కుమంది. పెద్ద పిల్ల సంగతి నాకు తెలియదు కాని, వనజ చాలా చురుకైన పిల్ల. సరియైన గాడిలో పడి చదివితే, ఎంతైనా పైకి రాగలదు! ఆ మాటే పైకి అన్నాను.

వెంటనే హెడ్మాస్టర్‌గారందుకొన్నారు. "తెలివితేటలుంటే సంసారాన్ని చక్కదిద్దుకుంటుంది. ఇదేం చదివి ఉద్యోగాలు చెయ్యాలా? ఊళ్ళేలాలా? ఇది చదివి ఉద్యోగం చేస్తేగాని తెల్లారదా మాకు? వయస్సు వచ్చాక ఆడపిల్లలు బయట తిరిగితే చెడడానికి ఆస్కారముంది. ఆడపిల్ల బతుకు అరిటాకు సామెతేగా!"

మాటల్లో ధ్వనించిన తిరస్కారం గ్రహించలేనంత మూర్ఖురాలిని కాను. మేము ఉద్యోగాలు చేస్తున్నాము. మా కుటుంబాన్ని ఆదుకొంటున్నాము. ఇరవై పైన, ఇరవైనాలుగు లోపల వయస్సు గల అవివాహితలము! అరిటాకులము!

ఎమ్. ఎ. చదివాడు. ఉద్యోగం చేస్తున్నాడు. ఆడపిల్లకు పుట్టి, ఆడపిల్లను పెండ్లి చేసుకొని, ఆడపిల్లలను కన్న ఈ భారత పౌరుడికి ఉద్యోగాలు చేసే ఆడవాళ్ళంటే లోకువ!

ఆ ప్రస్తావన అక్కడే ఆగిఉంటే ఏమయ్యేదో కాని, హెడ్మాస్టర్‌గారు మళ్ళీ అందుకొన్నారు: "ఏ చవటో, చెవులు తెగినవాడో తప్ప ఆడపిల్లల సంపాదన మీద బ్రతకడానికి ఎవరు ఇష్టపడతారు? ఆడపిల్లను అత్తారింటికి పంపడమే కన్నవాళ్ళ ధర్మం." ధర్మశాస్త్రాలు క్షుణ్ణంగా వల్లించినట్లున్నాడు!

మా నాన్నగారు ... ప్రేమగా పెంచి విద్యాబుద్ధులు చెప్పించిన మా నాన్నగారు చవట! శాస్త్ర ప్రకారం ఆడపిల్లల పెండ్లిండ్లు చేసి, పెన్షన్‌రూపంలో వచ్చే నూరు రూపాయలతో, మిగిలిన పిల్లలతో చావలేక, బ్రతకలేక బ్రతుకుతూఉంటే, పాపం, ఈ ధర్మశాస్త్రవేత్తలు చాలా సంతోషించేవాళ్ళు! దానికి విరుద్ధంగా మేము ఉద్యోగాలు చేసి, కుటుంబ భారాన్ని వహించడం నేరం! 1950 లో విద్యావంతుల నోటినుండి వినబడే మాట ఇది!

ఈ ఆలోచనలతో రెండు క్షణాలు నిశ్శబ్దంగా ఉండిపోయాను. దాన్ని ఆసరాగా తీసుకొని, "మొన్న క్లబ్బులోకూడా మీ సంగతే అనుకొన్నామమ్మా! పాపం, వయస్సుకు తగ్గ ముచ్చట లేక ఎట్లా ఉన్నారో చూడండి! అపనిందలు వచ్చాక, ఆడపిల్లకు పెండ్లి కావడం కష్టంగాదూ!" అని అన్నారు.

కొన్నాళ్లనించి నాన్నగారు క్లబ్బు ఎందుకు మానారో ఇవాళ తెలిసింది.

ఈ ధీరులంతా, పిత్రార్జితంమీద, గడ్డి తిని సంపాదించిన డబ్బుమీద ఆధారపడి బతుకుతున్న ఈ నీచులంతా నీతిగా, నిజాయితీగా బ్రతుకుతూ, మమ్మల్ని మనుష్యులుగా తీర్చి దిద్ది బాధ్యతాయుక్తంగా ప్రవర్తించే టట్లు చేసిన మా నాన్నగారిని ఏవో సూటిపోటీ మాటలు అనిఉంటారు.

నా కోపం హద్దు మీరింది. నన్ను నేను మరిచాను. ఆ కోపంలో అన్నాను: "మీ లాంటి నీచుల కడుపున పుట్టనందుకు సంతోషిస్తున్నాను. ఇంత బాధ్యత లేకుండా మీరు మాట్లాడారంటే, దానికి కారణం ఇవాళ్టి మీ పరిస్థితులు! ఈ పరిస్థితులు మారితే తప్ప మీరు మారరు. మరేం ఫర్వాలేదులెండి! పెండ్లి కానంతమాత్రాన కొంపలంటుకుపోవు. పెండ్లి కాక పోతే, పాపం, జీవితంలో గొప్ప అనుభవం పోగొట్టు కొంటున్నామని జాలిపడే మీ వంటి మూర్ఖులను చూస్తే నవ్వు వస్తున్నది. వివాహానికి ఇంత ప్రాముఖ్యం ఇగిలించారు కాబట్టే, అవివాహితల బ్రతుకు అవహేళన పాలవుతున్నది. పెండ్లి! పెండ్లి! పెండ్లి! ఎంతసేపూ ఈ మాట తప్ప రెండోది తోచదు. ఎంతమంది వివాహితులు, వివాహితలు మనస్సులను అదుపులో పెట్టు కొన్నారు? ఎంతమంది అవివాహితలు బరితెగించారు? మీరేం మునగలా! మీబోటివాళ్లు ఏమనుకొన్నా, మాకు లక్ష్యం లేదు. మా బాధ్యత మాకు తెలుసు. వివాహం జీవితంలో ధ్యేయం కాకూడదు. మా చెల్లెళ్లు, తమ్ముళ్లు పైకి రావడం ముఖ్యం. అది జరిగితే చాలు మాకు."

"అవునవునులే! రంకు సాగితే పెళ్ళెందుకు? నలుగురు మగాళ్లతో కలిసి తిరుగుతూ, ఉద్యోగాలు చేస్తూంటే చాలు, ఇంకా పెళ్లెందుకు? పెళ్లయితే ఒకడికే కట్టుబడాలి. ఈ పనీ వాటంగానే ఉందిలే!" చాలా హేళనగా నవ్వుతూ అన్నారు.

పాపం, కామాక్షమ్మ, ప్రసన్నల అవస్థ వర్ణనాతీతం! కామాక్షమ్మగారు "ఊరుకోండి. ఇంటికి వచ్చిన వాళ్లతో ఇలాగేనా మాట్లాడేది!" అంటూ భర్తను వారించ బోయారు.

"పోవే పక్షీ! నోరు మూసుకు అవతలకు చావు. తగుదునమ్మా అంటూ తల దూర్చితే, చావుదెబ్బలు తింటావు!" అని గట్టిగా అరిచారు.

కోపంతో నాకు యుక్తాయుక్తవివేకం నశించింది. అందుకే, "నీచులు ఎట్లాంటి మాటలనడానికీ, వినడానికీ కూడా జంకరు! మా మూలంగా స్కూలంతా పాడవు తున్నదని మీరు ఊళ్లో వేస్తున్న టముకు తెలియక పోలేదు! ఏనుగు దారిన పోతూంటే కుక్కలు మొరుగు తాయి! అయితే అది ఏనుగు గౌరవానికి లోపమా? అది సరే. మమ్మల్ని గురించి ఇన్ని శ్రీరంగనీతులు చెబుతున్నారు కదా! మేము మగాళ్లతో కలసి మెలిసి తిరుగుతాము. మా మనస్సులు పాపం, మీ హావభావాలకు లొంగిపోయాయి! మేము మంచివాళ్లం కాము! మరి, మీ పిల్ల వనజ మాట చెప్పండి! ఎవరితో తిరిగితే వయస్సు పరిపక్వానికి రాకముందే మనస్సు పక్వానికి వచ్చింది? పాపం, తల వంచుకొనే దారిన నడుస్తుంది. తల వంచుకొనే పాఠాలు వింటుంది. తల వంచుకొనే క్లాస్‌మేట్‌కి ఘాటయిన ప్రేమలేఖ వ్రాసింది! స్కూల్లో పనిచేసే ఆడవాళ్ళం మేమే కాబట్టి, ఆ కుర్రాడి తండ్రి జాబు నా చేతికిచ్చాడు. ఏదో తెలిసీ తెలియనితనం అని ఆయనకు నచ్చజెప్పాము. ఆ ఊహతోటే ఈ విషయం మీ చెవిన వెయ్యలేదు. ఇంకో సంగతి. మీ పెద్దపిల్ల ప్రసన్న రెండేళ్ల నుంచీ ఇంట్లోనే ఉన్నది. రెండేళ్ళు విగ్రహంగా ఉండగలిగిన పిల్ల ఇంకా కొన్నేళ్లు, లేదా జీవితాంతం విగ్రహంగా ఉండలేదా! వివాహం కొందరికి అవసరం. అట్లాంటి వాళ్లు, స్త్రీ అయినా సరే పురుషుడైనా సరే, వివాహం చేసుకోకపోతే అనర్థాలు జరుగుతాయి! అంతేగాని అందరికీ కాదు. పరిస్థితులతోపాటు ప్రజలూ మారాలి!" అని గట్టిగా అరిచాను.

వనజ ముఖంలో కత్తివాటుకు నెత్తురు లేదు! నాకు ఆ పిల్లను చూస్తే జాలి వేసింది. నిజానికి ఆ పసిపిల్లమీద నాకు కోపం లేదు. ఆ పిల్లను అవమానించేటంత నీచురాలిని కాదు. కాని, ఆ పిల్ల తండ్రి చేసిన తప్పుకు మూల్యం చెల్లిస్తున్నది!

కథ అడ్డం తిరిగింది. హెడ్మాస్టర్‌గారు తాపీగా, "ఆఁ, ఇట్లాంటి కథలు సవాలక్ష విన్నా. నా పిల్ల సంగతి నాకు తెలుసు. నీ లాంటి పక్షులు కూసినంత మాత్రాన దానికేం నష్టం లేదులే!" అని అన్నారు.

1950 నాటి సంఘం ఇది! కని, పెంచి పెద్దచేసిన తలిదండ్రులను వాళ్ల గతికి వాళ్లను వదిలి, మేము సంఘ మర్యాదకు లోబడి గృహిణులమైతే, వీరంతా, ఈ న్యాయ, ధర్మశాస్త్ర రక్షకులంతా మంగళాక్షతలు చల్లేవాళ్లా! ఆడపిల్ల కుటుంబానికి సహాయపడకూడదు. తండ్రి ఆడపిల్లలమీద ఆధారపడకూడదు! మగపిల్లల మీద పడచ్చు! కుడికంటితో చూడచ్చు! ఎడమ కంటితో చూడరాదు!

చేతిలో కత్తి ఉంటే పొడిచేటంత కోపం! నిస్సహాయత! అవమానం!

నాకు ఒకళ్లముందు ఏడవడమంటే అసహ్యం! అందుకని, వచ్చే కన్నీళ్లని బలవంతంగా ఆపి, "పూర్వీకుల ఆస్తిమీద పుట్టగొడుగుల్లాగా పెరుగుతూ గానుగెద్దు జీవితాలు గడిపే నీబోటి వెధవలకు అంతకంటే ఎక్కువ భావాలెట్లా ఉంటాయిలే!" అని అంటూ చరచరా బయటికి వచ్చాను.

ఈ విషయమంతా ఇంట్లో చెప్పి, మరునాడు నా రాజీనామా పంపాను. ఇది నాన్నగారి సలహా. "వాడు దుష్టుడు. మాట పడి ఊరుకోడు. రేపు పొద్దున్న కమిటీ మెంబర్లతో నీ మీద చెడ్డగా చెప్పి, ఉద్యోగం తీయించుతాడు. అంతకంటే, వాడిమీద దెబ్బ తీసినట్లు ఇది మంచి" అన్నారు.

దాదాపు వెల రోజుల తరవాత నాన్నగారి స్నేహితు లైన సూర్యనారాయణ బాబాయిగారి మూలంగా నాకు అనంతపురంలో టీచర్ పని చిక్కింది. మరో మూడు నెలల తరవాత అక్కకూ అదే ఊళ్లో ఉద్యోగం చిక్కడంతో మేమంతా ఆనందపురం వదిలి అనంతపురం ప్రవేశించాము.

ఆ తరవాత స్త్రీ సంక్షేమ శాఖలో ప్రవేశించి, ఇవాళ ఈ హోదాలో ఉన్నాను. భగవంతుడు చల్లగా చూడటంవల్ల మా కుటుంబం పైకి వచ్చింది, మా ఊహలో. తమ్ముళ్లు ఇద్దరూ ఐ. ఎ. ఎస్. ఆఫీసర్లు. ఒక చెల్లెలు డాక్టర్. ఒక చెల్లెలు లెక్చరర్. అక్క ఇవాళ గెజెటెడ్ ఇన్స్పెక్ట్రస్. అందరమూ స్వేచ్ఛా విహంగాలం!

ఇప్పుడు ప్రతివాళ్లూ మా తలిదండ్రుల అదృష్టాన్ని పొగిడేవాళ్లే!

ఇదీ మా కథ. ఆనాడు నా రాజీనామాకు కారణ మైన హెడ్మాస్టర్ నరసింహమూర్తిగారి దర్శనం మళ్లీ ఇన్నాళ్లకు! ఆ పేరు వినగానే వెనకటి కథ అంతా జ్ఞాపకం వచ్చింది.

గడిచిన కథ నెమరువేసుకుంటూ నిశ్శబ్దంగా ఉన్నందుకు ఏమనుకొన్నారో ఏమో, "ఏమమ్మా, ఇంకా గుర్తుకు రాలేదూ?" అంటూ ప్రశ్నించారు.

నేను జవాబిచ్చాను: "లేదులెండి! మిమ్మల్ని ఎట్లా మరిచిపోగలను? ఏం, ఈ అర్ధరాత్రి ఇట్లా వచ్చారేం? అస లిక్క డెందు కున్నారు? నే నిక్క డున్నానని మీ కెట్లా తెలుసు?"

"కృష్ణశాస్త్రి చెప్పాడమ్మా. మీరు వాచ్‌మన్‌ను కాఫీకి పంపారుగా. అడిగితే మీ పేరు చెప్పాడు. వాడు నా స్నేహితుడుగా. అన్నట్లు, మేము ప్రస్తుతం కంభంలో ఉంటున్నాము. మా వనజమ్మ అత్తగారి ఊరు ఇక్కడికి దగ్గరే. కొన్ని వ్యవహారాలుంటే ఆ ఊరికి వచ్చాను. ఎట్లా వచ్చానుగదా, కృష్ణశాస్త్రిని చూచిపోదామని ఇటు వచ్చాను" అని ఆయన జవాబిచ్చారు.

ఎంత సరళంగా జవాబిద్దామనుకొన్నా, నా నోటి నుండి వ్యంగ్యంగానే వెలువడింది. "చాలా సంతోషం! పొద్దు పోయింది. ఇక వెళ్లిరండి."

> తనకు తానే చట్టమయినప్పు డిక వేరే చట్టాల అవశ్యకత లేదు.
>
> —చాప్‌మాన్

కాని ఆయన కదిలే సూచనలేవీ కనిపించడం లేదు. ఏదో చెప్పటానికి సంశయిస్తున్నాలు.

బయటకు తొంగిచూశాను. వెన్నెల్లో చెట్ల ఆకులు మిలమిలలాడుతున్నాయి. బయట మంచం వేసుకొని, ఆకాశంలోని చందమామను చూస్తూ, హాయిగా పడుకొందామంటే ఈయన కదలడు!

ఒక నిమిషం నిశ్శబ్దం.

తరవాత ఆయన సంకోచిస్తూ అడిగాడు: "మీ దగ్గిర థర్డ్ ఫారం పాసయిన వాళ్లకు ఉద్యోగాలేమన్నా ఉన్నాయామ్మా?"

నాకు ఆశ్చర్యం వేసి, "ఎవరికండీ?" అని అడిగాను.

ఆయన కాస్సేపు నీళ్లు నమిలి, "మా వనజకే నమ్మా. దాని మొగుడు చనిపోయాడు. భర్తవెంపు ఆస్తి ఆట్టే లేదు. ఉన్న ఆస్తి కాస్తా కోర్టు వ్యవహారాల్లో ఉంది. వనజమ్మ కిద్దరు పిల్లలు. దానికే దైనా ఉద్యోగం చిక్కితే దాని పిల్లలకు ఆధరువు" అని అన్నారు.

నాకు గతం జ్ఞాపకముంది. నేను మనిషిని! కోపం, పగ ఇత్యాదులకు అతీతురాలినిగాను. ఈ నీచుడు ఉద్యోగాలుచేసే ఆడపిల్లలంటే చాలా తేలిక భావం చూపెట్టాడు. ఇవాళ తన కూతురికి ఉద్యోగం కావాలని అడుగుతున్నాడు!

నేను చాలా శాంతంగా అడిగాను: "ఆ పిల్లకు ఉద్యోగ మేం ఖర్మ? మీరున్నారుగా ఆదుకొనేందుకు?"

దిగులుగా నవ్వి జవాబిచ్చా డాయన. "కమిటీ ముం

రామతీర్థ బ్రాహ్మీ ఆయిల్

స్పెషల్ నం: 1 రిజిస్టర్డు

చుండ్రు, జుట్టు రాలిపోవుట నివారించే ఒక అమూల్యమైన కేశపోషణి. అది విలువయ్యైన అనేక దినుసులతో శాస్త్రీయంగా తయారు చెయ్యబడినది. మెదడును చల్లబరచి, ఆరోగ్యాన్ని అభివృద్ధి పరచి, సుఖనిద్ర నిస్తుంది. శరీర పుష్టికి ముఖ్యంగా శక్తిమయ్యైనది. ప్రతి వారికి అని ఋతువులలోను ఉపయోగమ్మైనది.

ప్రతి చోటా లభిస్తుంది.

శ్రీ రామతీర్థ యోగాశ్రమం

దాదర్ సెంట్రల్ రైల్వే ... —14. ఫోన్: 442899

ప్రపంచ ప్రఖ్యాతం చర్మరక్షణకు




2 సైజులలో లభిస్తుంది.

కుటికురా ఆయింట్‌మెంట్ పులిపిరి కాయలను మొటిమలను కలిగించే సూక్ష్మక్రిములను నాశనం చేస్తుంది; దానిలోని బాగా లోతుకు చొచ్చుకొనిపోయే గుణం గల యాంటిసెప్టిక్ తైలాలు కోతలకు, గాయాలకు, కాలిన పుండ్లకు, పుడుగు కాట్లకు, పగిలిన లేక పెరపెరలాడే చర్మానికి, తీట, గజ్జి మొదలగు చర్మవ్యాధులకు సత్వర ఉపశమనం కలిగిస్తాయి; అదే సమయంలో పునరుజ్జీవనం కలిగిస్తూ చర్మ ఆరోగ్యాన్ని యథాస్థితికి చేరుస్తుంది.

కుటికురా

ఆయింట్‌మెంట్

JAISONS


కొడుకులు నన్ను పనిలోంచి తీసివేశారమ్మా. వాళ్లకు వంగి సలాములు చెయ్యకపోతే అంతే మరి. తరవాత ఎక్కడా స్థిరంగా ఉద్యోగం చిక్కలేదు. ప్రసన్నకూ, వనజకీ పెండ్లి చేసేటప్పటికే మాకు తల ప్రాణం తోకకి వచ్చింది! మళ్లీ పిల్లనూ, దాని పిల్లలనూ సాకాలంటే మాకు కష్టంగాదా, అమ్మా!''

నేను చదువుకొన్నదాన్నే. కాని, చంపదగిన యుక్తి శత్రువు చేతజిక్కితే, ఏమీ అనకుండా, శత్రువు తప్పు ఎత్తి చూపించకుండా, మేలు చేసి పొమ్మనటానికి నే నేమీ దేవతను కాను! మామూలు మనిషిని. నాకు ప్రేమ ఉంది. పగ ఉంది. జాలి ఉంది. ప్రతీకార వాంఛ ఉంది!

స్త్రీ సంక్షేమ శాఖలో పనిచేస్తున్న నాకు స్త్రీల గాథలు కొత్తేం కాదు. రోజుకో రకం కథ వింటూంటాను. ఆ కథలతో పోలిస్తే, ఇది పెద్ద హృదయ విదారక గాథ కాదు.

నాలో కోపం కట్టలు తెగి ప్రవహించింది. "ఆడవాళ్ళు ఉద్యోగం చేస్తే అవమానం కాదుటండీ! భర్త లేడు: వయస్సులో ఉంది. మీ పిల్ల ఇవాళ ఉద్యోగం చేస్తే మనసు చెడుతుందేమో? ఆ రోజు మా సంపాదన మీద ఆధారపడ్డారని మా నాన్నగారిని సిగ్గుగా అన్నారే! ఇవాళ ఆడపిల్లకు తిండి పెట్టలేక, ఉద్యోగం పేరుతో దేశంమీదికి తోలడం తండ్రి గొప్ప బాధ్యత గాదా!''

"క్షమించండమ్మా! నా కళ్ళు తెరిపిన పడ్డాయి..." ఇంకా ఏదో అనబోతున్నా రాయన.

మధ్యలోనే ఆపాను. "ఎవర్ని క్షమించడం? నా అదృష్టవశాత్తూ, మీ దురదృష్ట వశాత్తూ ఇది ఇట్లా జరిగింది కాబట్టి గతానికి మీరు పశ్చాత్తాప పడుతున్నారు. చీకటిలోనించి వెలుగులోకి వచ్చినట్టు భావిస్తున్నారు. కాని మీ వారసులు చాలామంది ఉన్నారుగా—అవివాహితలుగా ఉద్యోగాలు చేసేవాళ్ళంటే తేలిక అభిప్రాయాలు గల వాళ్ళూ, పెండ్లే జీవిత పరమార్థమని, అది లేకపోతే జీవితంలో గొప్ప అనుభవాలు పోగొట్టుకొన్నారని సానుభూతి చూపే ఆషాఢభూతులూ, నీతిని వివాహితలకు, అవినీతిని అవివాహితలకు పంచే పెద్దలూను! వాళ్ళ భావాలు ఇప్పుడిప్పుడే మారిపోవు! వారంతా ఆడపిల్లలమీద ఆధారపడిన తండ్రులని గురించి పత్రికలో విమర్శిస్తూనే ఉంటారు. బాధ్యత నేర్పడానికి బదులు, తామేదో గొప్ప త్యాగం చేస్తున్నామన్న భావాలను అవివాహితల మనసుల్లో నాటుతున్నారు!'' కోపంలో నాకు మాట ముందుకు సాగలేదు.

ఆయన గభాలున కుర్చీలోంచి లేచి, నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్లిపోతున్నారు.

ఆయన్ని వెనక్కి పిలవలేదు. నాకు వనజమీద ఏ ద్వేషమూ లేదు. నా కోపమంతా, ఇదుగో, ఈ సంఘ సంస్కర్తల ముసుగువేసేవాళ్ళమీదే.!

మరునాడు కృష్ణశాస్త్రిగారితో, వనజను వచ్చి, నన్ను హెడ్‌క్వార్టర్స్‌లో కలుసుకొనమని చెప్పితే సరిపోతుంది. ఒక ఊళ్ళో ఆర్గనైజర్ పని ఖాళీగానే ఉంది. ఆ అమ్మాయిని వేయవచ్చు.

వెన్నెల్లో తపస్సు చేసుకొనే వెన్నెవంక, చీకటిలోంచి వెలుగులోకి వస్తున్న అరణ్యాన్ని, దూరపు కొండలను చూస్తూ పడుకొన్నాను. ★